క్లుప్తంగా

పరామర్శ



పరామర్శిస్తున్న ఎంపీ నగేశ్

బోథ్: సొనాల మండలంలోని పార్డి(బి) గ్రామానికి చెందిన లలితబాయి ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎంపీ గోడం నగేశ్ శుక్రవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. బీజేపీ మండల అధ్యక్షుడు బోరె రవీందర్, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ రాజు, జీ.వి రమణ, రాజేశ్వర్, విష్ణు, తులసిరాం, బాశెట్టి రమేశ్ ఉన్నారు.

వైద్య శిబిరం



ఆరోగ్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

కైలాస్‌నగర్: బల్దియాలో అమలవుతున్న 100 రోజుల కార్యచరణ ప్రణాళికలో భాగంగా శుక్రవారం మెప్మా ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయంలో ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. అంకోలి పీహెచ్‌సీ వైద్యురాలి ఆధ్వర్యంలో మెప్మా రిసోర్సు పర్సన్లు, పారిశుద్ధ్య మహిళ కార్మికులకు ఆరోగ్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మెడిసిన్‌ను అందజేశారు. కార్యక్రమంలో మెప్మా డీఎంసీ కె.శ్రీనివాస్, పర్యావరణ ఇంజనీర్ రాథోడ్ అవికిరణ్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలి



ఎస్‌ఈకి వినతిపత్రం అందజేస్తున్న రూపేశ్‌రెడ్డి

ఆదిలాబాద్‌టౌన్: ఇటీవల ఈదురుగాలులు, వర్షాలతో విద్యుత్ స్తంభాలు దెబ్బతిన్నాయని, బేల మండలంలో దాదాపు 80 స్తంభాలు నేల కొరిగాయని యువజన కాంగ్రెస్ అసెంబ్లీ ఉపాధ్యక్షుడు సామ రూపేశ్ రెడ్డి అన్నారు. శుక్రవారం విద్యుత్ శాఖ ఎస్‌ఈ జేఆర్ చౌహాన్‌కు వినతి పత్రం అందజేశారు. భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న విద్యుత్ స్తంభాల స్థానాల్లో కొత్త వాటిని ఏర్పాటు చేయాలన్నారు.

16న స్పాట్ కౌన్సెలింగ్

ఇచ్చోడ: మండల కేంద్రంలోని గిరిజన గురుకుల బాలికల కళాశాలలో ఇంటర్‌లో మిగిలిన సీట్ల కోసం ఈనెల 16న స్పాట్ కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ రోజారాణి తెలిపారు. బైపీసీలో 6, ఎంపీసీలో 12, సీఈసీలో 5 సీట్లు ఖాళీలు ఉన్నాయన్నారు. పదో తరగతి పాసైన విద్యార్థులు స్పాట్ కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని కోరారు. మెరిట్ ఆధారంగా సీట్లు కేటాయించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని కోరారు.

ప్రిన్సిపాల్‌కు సన్మానం

బోథ్: బోథ్ మడంల కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ బాలికల గురుకుల పాఠశాలలో వంద శాతం ఫలితాలు రావడం పట్ల స్వేరోస్ మాజీ అధ్యక్షులు భీంరావ్ పాటిల్ సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం ప్రిన్సిపాల్ సంగీతను అభినందించి, శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో మహార్ సంఘం జిల్లా నాయకులు సోమన్న, మునేశ్వర్ ఉన్నారు.

ఎంపీ, ఎమ్మెల్యే పరామర్శ

బజార్‌హత్నూర్: మండల కేంద్రంలో ఇటీవల అనారోగ్యంతో బిట్లింగ్ దశరథ్, జడల భూమన్న మృతి చెందిన విషయం తెలుసుకున్న ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ గ్రామానికి చేరుకుని ఇరు కుటుంబాలను పరామర్శించారు. మాజీ జెడ్పీటీసీ తాటిపల్లి రాజు, అల్కే గణేష్, చిల్కూరి భూమన్న, కానిందే రాజారాం, చంద్రశేఖర్ ఉన్నారు.

సన్మానం

ఆదిలాబాద్‌టౌన్: ప్రభుత్వ కవి, రచయిత, ఉపాధ్యాయుడు ఉదారి నారాయణను సామాజిక కార్యకర్త ముడుపు మౌనిష్ రెడ్డి సన్మానించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఉదారి నారాయణ నివాసంలో శాలువాతో సత్కరించారు. ఇటీవల తెలంగాణ సరస్వత పరిషత్ ఉదారి నారాయణ పురస్కారాన్ని అందుకున్నారు. ఆయన వెంట వీరన్న, సురేందర్ రెడ్డి, ఆశన్న యాదవ్, జహీర్, శ్రీకాంత్ రెడ్డి ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని రిమ్స్ సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఎస్‌ఈ జేఆర్ చౌహాన్ ఒక ప్రకటనలో తెలిపారు. 33 కేవీలైన్, సబ్‌స్టేషన్ నిర్వహణ కారణంగా టీచర్స్ కాలనీ, సంజయ్‌నగర్, పాత హౌజింగ్‌బోర్డు, కైలాస్‌నగర్, పాలిటెక్నిక్, ఆర్ఆర్ నగర్, వాల్మీకినగర్, శాంతినగర్, కొత్త కుమ్మర్‌వాడ ప్రాంతాల్లో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా నిలిపివేయడం జరుగుతుందని పేర్కొన్నారు.

జాగ్రత్తలే శ్రీరామ రక్ష

- పొంచి ఉన్న సీజనల్ వ్యాధులు
- పరిసరాల పరిశుభ్రతే ముఖ్యం

సిరికొండ: వర్షాలు కురుస్తున్నందున సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. ఈగలు, దోమలు వృద్ధి చెంది ప్రజలు రోగాల భారిన పడతారు. అలాగే నీటి కాలుషితంతో అనారోగ్యానికి గురవుతారు. ముందుగానే వ్యాధులపై అవగాహన పెంచుకొని జాగ్రత్తలు పాటిస్తే వ్యాధులు దరిచేరవు.

పరిసరాలు పరిశుభ్రత..

వర్షాకాలంలో తమ చుట్టూ ఉన్న పరిసరాలను చెత్త, చెదారం లేకుండా పరిశుభ్రంగా ఉంచుకుంటే సగం వ్యాధుల నుంచి తప్పించుకోవచ్చు. ఎందుకంటే మన ఇంటి చుట్టూ చెత్త, చెదారం, పిచ్చిమొక్కలు, వర్షపు నీరు నిల్వ ఉంటే దోమలు వృద్ధి చెంది అనేక రోగాలు వచ్చే అవకాశం ఉంది. ముఖ్యంగా దోమల ద్వారా వచ్చే మలేరియా, టైఫాయిడ్, చికెన్ గున్యా మనుషులను కోలుకోలేకుండా చేస్తాయి.

వర్షాకాలం జాగ్రత్తలు..

- ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి.
- వర్షాకాలంలో కొత్త నీరు వస్తుంది. తాగేనీటిని కాచీ చల్లార్చిన తరువాతే తాగాలి. లేదంటే క్లోరినేషన్ చేసిన నీటిని తాగాలి.



డ్రై డేలో భాగంగా నిల్వ నీటిని తొలగిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

- తమ ఇంటి చుట్టూ పరిసరాల్లో పరిశుభ్రంగా ఉంచి, పాత టైర్లు, కొబ్బరి బొండాల్లో నిల్వ నీటిని తొలగించాలి.
- ఇంటిలో పెంచుకున్న అలంకరణ మొక్కను శుభ్రం చేస్తుండాలి.
- ప్రతీ రోజు డ్రమ్ముల్లో నీటిని పారబోస్తూ.. కొత్త నీటిని నింపుకోవాలి.

డ్రై డే పాటిస్తున్నాం



మండలంలో ప్రతీ శుక్రవారం, మంగళవారం గ్రామాల్లో డ్రై డే పాటిస్తున్నాం. ఇళ్లల్లోని పాత డ్రమ్ములు, టైర్లు, పూల కుండీల్లో నిల్వ ఉన్న నీటిని పారబోస్తూ.. వీటి వల్ల ప్రజలకు కలిగే అనార్థాలను తెలియజేస్తున్నాం. అన్ని గ్రామాలకు బ్లీచింగ్ పౌడర్ సప్లై చేశాం.

– సంతోష్ కుమార్, ఎంపీవో, సిరికొండ

చెత్త తొలగిస్తున్నాం

గ్రామ పంచాయతీల్లో ప్రతీరోజు శానిటేషన్ పనులు చేయిస్తున్నాం. పంచాయతీ ట్రాక్టర్ ద్వారా గ్రామాల్లో ఉన్న చెత్తను ప్రతీరోజు డంపింగ్ యార్డుకు తరలిస్తున్నాం. డ్రెయినేజీల్లో పూడిక తీయిస్తున్నాం. – సూర్యప్రకాశ్, పంచాయతీ కార్యదర్శి, సిరికొండ

- పిల్లలకు, పెద్దలకు వాంతులు, విరేచనాలు వస్తే వెంటనే వైద్యులకు చూపించాలి.
- రాత్రి వేళలో దోమ తెరలను వాడాలి.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడాలి

- జిల్లా పంచాయతీ అధికారి రమేశ్

నేరడిగొండ: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారి రమేశ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం మండల కేంద్రంతో పాటు చిన్న బుగ్గారం గ్రామాలలో పర్యటించారు. వానాకాలంలో అంటు వ్యాధులు వ్యాపించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. రోడ్లు, ముఖ్య కూడళ్లు, డ్రెయినేజీల్లో వర్షపు నీరు నిల్వకుండా చూడాలన్నారు. క్లోరినేషన్ తర్వాతే తాగునీరు సరఫరా చేయాలని, పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ఆయన వెంట ఎంపీవో లక్ష్మణ్, పంచాయతీ కార్యదర్శి నర్సారెడ్డి ఉన్నారు.

ఇచ్చోడ: ముందస్తుగా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీవో లక్ష్మణ్ గ్రామస్తులను కోరారు. శుక్రవారం డ్రై డే సందర్భంగా జల్దా గ్రామంలో పర్యటించి ఇంటి ముందు ఉన్న నీటి నిల్వలను తొలగించారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

నార్నూర్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఏజెన్సీ జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ మనోహర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని జిన్‌గూడ, మైనార్టీ వార్డులో నిర్వహించిన డ్రై డే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మురికి కాలువలు, తాగునీటి చేతిపంపులు, బావులను పరిశీలించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో లక్ష్మి, హెచ్‌ఈవో తులసిదాస్, చౌహన్ చరణ్ దాస్, సత్తవ్వ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



డ్రెయినేజీ పరిశీలిస్తున్న డీపీవో రమేశ్

జైనథ్: వర్షాకాలంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పీహెచ్‌సీ వైద్యాధికారి నైనత ప్రజలకు సూచించారు. డ్రై డేలో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలో అవగాహన కల్పించారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ వేణు, వసంత, సిబ్బంది అంజయ్య, ఏఎన్‌ఎంలు గంగామణి, గంగమ్మ, స్రవంతి, ఉషమ్మ పాల్గొన్నారు.

నేరడిగొండ: ప్రతీ శుక్రవారం నిల్వ ఉన్న నీటిని పారబోసి డ్రై డేను పాటిస్తే వ్యాధులకు దూరంగా ఉండవచ్చని నేరడిగొండ పీహెచ్‌సీ హెచ్‌ఈఓ పవార్ రవీందర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో డ్రై డేపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరుగుతూ నిల్వ ఉన్న నీటిని పారబోయించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ సంతోష్, హెల్త్ అసిస్టెంట్ జగదీశ్వర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, ఆశ కార్యకర్త జయమ్మ, అంగన్‌వాడీ కార్యకర్త పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు.. ఒకరి పరిస్థితి విషమం

సాత్నాల: సైద్‌పూర్ గ్రామ సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆత్రం బొజ్జు, సీడం ముత్తు, మాడవి లచ్చుకు గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తిప్ప గ్రామం నుంచి సైద్‌పూర్‌కు ఆత్రం బొజ్జు, సీడం ముత్తు, మాడావిడి లచ్చు ఒకే బైక్‌పై వెళ్తూ ఆదిలాబాద్ నుంచి సైద్‌పూర్‌కు వస్తున్న ఆర్టీసీ బస్సును ఢీకొని గాయాలపాలయ్యారు. వెంటనే స్థానికులు 108 అంబులెన్స్‌లో వారిని ఆదిలాబాద్‌లోని రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. వీరిలో మాడవి లచ్చు పరిస్థితి విషమంగా ఉంది.

మట్కా నిర్వాహకుడిపై కేసు

బేల: మండల కేంద్రంలోని శివాజీ చౌరస్తాలోని ఓ హోటల్‌లో శుక్రవారం ఆన్‌లైన్‌లో మట్కా నిర్వహిస్తున్న రాసేకర్ సందీప్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగనాథ్ పేర్కొన్నారు. సమాచారం మేరకు సిబ్బందితో కలిసి నిర్వహించిన ఈ దాడిలో ఆన్‌లైన్ మట్కా చిటీలతో పాటు రూ.10,200 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మట్కా నిర్వాహకుడితో పాటు ఆడుతున్న పలువురిపై కేసు నమోదు చేస్తామన్నారు. అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తే చర్యలు తప్పవని ఎస్సై హెచ్చరించారు.

రెవెన్యూ సదస్సు సద్వినియోగం చేసుకోండి

నార్నూర్: భూ సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం గ్రామగ్రామాన రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తుందని, రైతులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్ అన్నారు. శుక్రవారం గాదిగూడ మండలంలోని ఝరి గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ సమస్యలు పరిష్కారం కోసమే ప్రభుత్వం భూభారతి చట్టాన్ని తీసుకొచ్చిందని, ఎన్నో ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోని సమస్యలను రెవెన్యూ సదస్సుల ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. ప్రతీరోజు ఒకటి, రెండు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ చౌహన్ విలాష్, ఆర్ఐ అనుసూయ, తదితరులు పాల్గొన్నారు.



దరఖాస్తులు పరిశీలిస్తున్న ఉట్నూర్ సబ్ కలెక్టర్

బజార్‌హత్నూర్: భూ భారతి రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ శ్యాంసుందర్ అన్నారు. శుక్రవారం మండలంలో మోహాద, కొలార గ్రామాల్లో భూభారతిపై రెవెన్యూ సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో నయబ్ తహసీల్దార్ హీరాలాల్, ఆర్ఐ నూర్‌సింగ్, సీనియర్ అసిస్టెంట్ విద్యాసాగర్‌రెడ్డి, కరుణకర్ రెడ్డి, స్రవంతి, రమేశ్, భోజన్న, వికాస్ గౌతం పాల్గొన్నారు.

విద్యార్థులకు పోషకాహారం అందించాలి

నేరడిగొండ: విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పోషకాహారం అందించాలని బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ కన్వీనర్ విశారదన్ మహరాజ్ అన్నారు. జిల్లా కేంద్రంలో ప్రారంభించిన లక్ష కిలో మీటర్ల మా భూమి రథయాత్ర గురువారం మండల కేంద్రానికి చేరుకుంది. శుక్రవారం ఆయన మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలను సందర్శించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులకు అన్ని సౌకర్యాలను కల్పించి ఉన్నత శిఖరాలకు చేర్చాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మ, అన్నెల లక్ష్మణ్, అంజయ్య, గంగన్న, లక్ష్మణ్, జయవర్ధన్, నరేందర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విశారదన్ మహరాజ్

చోరీ చేసిన వస్తువులు కొనుగోలు చేయొద్దు

ఆదిలాబాద్‌టౌన్: స్క్రాప్ దుకాణాల యజమానులు చోరీ చేసిన వస్తువులను కొనుగోలు చేయవద్దని ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం డీఎస్పీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. స్క్రాప్ దుకాణ యజమానులు కాపర్ వైర్లు, వాహనాల విడిభాగాలు కొనే ముందు సరి చూసుకోవాలన్నారు. ఇప్పటివరకు ఆదిలాబాద్‌లో ఇద్దరిని అరెస్టు చేయడం జరిగిందన్నారు. దొంగ వస్తువులు కొనుగోలు చేసిన పలువురిపై కేసులు నమోదు చేసినట్లు వివరించారు. వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో ఈనెల 4న బొక్కల్‌గూడకు చెందిన సమీర్ హుస్సేన్‌ను, టూటౌన్ పోలీసు స్టేషన్‌లో గురువారం ఖుర్షీద్‌నగర్‌కు చెందిన షేక్ ముజాహిద్‌లను రిమాండ్‌కు తరలించామన్నారు. షేక్ ముజాహిద్ షాపులో తనిఖీలు చేపట్టగా ఎలక్ట్రిక్ మోటార్లు, బ్యాటరీలు, ఎలక్ట్రిక్ సర్వీస్ వైర్లు, దొంగలించిన వస్తువులు లభించినట్లు పేర్కొన్నారు. స్క్రాప్ యజమానులు కొనుగోలు చేసే సమయంలో జాగ్రత్తలు పాటించాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

వర్కింగ్ జర్నలిస్టుల పిల్లలకు ఫీజులో రాయితీ

ఆదిలాబాద్‌టౌన్: ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న వర్కింగ్ జర్నలిస్టు పిల్లలకు ఫీజులో 50 శాతం రాయితీ కల్పిస్తూ డీఈవో ఉత్తర్వులు జారీ చేసినట్లు టీయూడబ్ల్యూజే హెచ్–143 జిల్లా అధ్యక్షుడు బేత రమేశ్ తెలిపారు. శుక్రవారం జిల్లా విద్య శాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డిని కలిశారు. ఈ అవకాశాన్ని వర్కింగ్ జర్నలిస్టులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎల్.రాజు, శానం ప్రవీణ్, సంతోష్, తేజ, మధు, సుభాష్, రత్నాకర్, విజయ్, ప్రవీణ్ పాల్గొన్నారు.

యోగా దినోత్సవం విజయవంతం చేయాలి

నార్నూర్: అంతర్జాతీయ యోగా దినోత్సవ దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని ప్రోగ్రాం మోడల్ ఆఫీసర్ కస్తాల చంద్రశేఖర్, జిల్లా ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ ప్రీతమ్ రాథోడ్ కోరారు. శుక్రవారం జిల్లా మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. దీనికి సంబంధిత బ్యానర్, పోస్టర్‌ను కలెక్టర్ రాజర్షి షా ఆవిష్కరించారు. జూన్ 21న ఇంటర్నేషనల్ డే ఆఫ్ యోగా ఈవెంట్‌ని జిల్లా కేంద్రంలో నిర్వహించే కార్యక్రమంలో ప్రజలందరూ పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ నోడల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీకాంత్, యోగా ఇన్‌స్ట్రక్టర్ చేతన్, సంతోష్, రజిత, ఆయుష్ సిబ్బంది పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రాజర్షిషా

అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు



మంజూరు పత్రం అందజేస్తున్న ఎంఈఈ



భూమిపూజ చేస్తున్న ఆడే గజేందర్

నేరడిగొండ: అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇచ్చేలా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ అన్నారు. శుక్రవారం మండలంలోని బొందిడి, మాల్టోద్ది గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల కోసం భూమిపూజ చేసి, పనులు ప్రారంభించారు. బీఆర్ఎస్ మాటలకే పరిమితమైందని, నేరడిగొండ మండలంలో ఒక్క ఇళ్లు ఇవ్వలేదని, కాంగ్రెస్ హయాంలో ప్రతీ పేదవాడికి పక్కా ఇళ్లు నిర్మించి ఇస్తామన్నారు. కార్యక్రమంలో బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు ఆడే వసంత్ రావు, మాజీ సర్పంచ్ ఆడే జనార్దన్, ఏలేటి రాజశేఖర్ రెడ్డి, రాథోడ్ మధుకర్, తుకారాం, వసంత్ రావు, రమేశ్, అశోక్, ఖాజా, మార్కండేయ, రాజు నాయక్ పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల సాకారానికే ‘ఇందిరమ్మ’

కైలాస్‌నగర్: ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక చేయూతను సద్వినియోగం చేసుకుని ఇండ్లను నిర్మించుకోవాలని మున్సిపల్ ఇంజనీర్ పేరిరాజు సూచించారు. ఆదిలాబాద్ పట్టణంలోని మహాలక్ష్మివాడ, చిల్కూరి లక్ష్మినగర్ కాలనీలకు చెందిన 40 మంది లబ్ధిదారులకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్ పత్రాలను శుక్రవారం అందజేశారు. ఆర్థిక సాయంపై వారికి అవగాహన కల్పించారు. పేదల సొంతింటి కలను సాకారం చేయాలనే ఉద్దేశ్యంతోనే ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను నిర్మిస్తుందన్నారు. కార్యక్రమంలో వార్డు ఆఫీసర్ సాయికుమార్, మాజీ కౌన్సిలర్ సంద నర్సింగు, రొడ్డ రవి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

శిఖం భూమి ఆక్రమించారని ఫిర్యాదు

తాంసి: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల సమీపంలోని వాగు పక్కన ఉన్న మత్తడివాగు ప్రాజెక్టు శిఖం భూమిని ఆక్రమించుకుంటున్నారని గ్రామస్తులు తహసీల్దార్ లక్ష్మికి శుక్రవారం ఫిర్యాదు చేశారు. గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఆ భూమిలో మట్టి నింపి ఈత చెట్లు పెంచుతున్నాడని తెలిపారు. వర్షాకాలంలో వరద నీరు సక్రమంగా వెళ్లక ఎస్సీ కాలనీలు ముంపుకు గురయ్యే అవకాశం ఉందన్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరాఱు. డీటీ గణేశ్, గ్రామస్తులు అరుణ్, ముత్తన్న, శ్రీనివాస్, రవి, తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న గ్రామస్తులు

కురిసిన వర్షం.. నిలిచిన రాకపోకలు

బేల: మండలంలోని టాక్లీ శివారులో శుక్రవారం కురిసిన భారీ వర్షానికి వరద నీళ్లు ఉప్పొంగి వాగు ప్రవహించింది. దీంతో అంతర్రాష్ట్ర రాకపోకలు నిలిచిపోయాయి. 353బి జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా వంతెనలు నిర్మాణంలో ఉండగా.. ప్రక్కన తాత్కాలిక వంతెనపై నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. వర్షానికి పైప్‌లపై మట్టి కొట్టుకుపోవడంతో రాకపోకలు అంతరాయం కలిగింది. స్పందించిన నేషనల్ హైవే అధికారులు మరమ్మతులు చేయించడంతో సాయంత్రం రాకపోకలు పునః ప్రారంభమయ్యాయి.



నిలిచిన వాహనాలు

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

ఇంద్రవెల్లి: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని ఐటీడీఏ డీడీ జాధవ్ అంబాజీ అన్నారు. గిరిజన సంక్షేమశాఖ బడిబాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని కేస్లాపూర్ నాగోబా ఆలయంలో ఏర్పాటు చేసిన సాముహిక అక్షరాభ్యాస కార్యక్రమానికి హాజరయ్యారు. ముందుగా ఇంద్రవెల్లి, కేస్లాపూర్, పిట్టబొంగరం స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు నాగోబా పూజారి మెస్రం శేక్‌నాథ్ ఆధ్వర్యంలో అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో ఏసీఎంవో జగన్, ఎంఈవో రాథోడ్ మాను కుమార్, మెస్రం వెంకట్‌రావ్, మెస్రం ఆనంద్‌రావ్ పాల్గొన్నారు.

ఇచ్చోడ: మండలంలోని మేడిగూడ ఆశ్రమ పాఠశాలలో శుక్రవారం స్కూల్ కాంప్లెక్స్ ఆధ్వర్యంలో సాముహిక అక్షరాభాస్యం చేయించారు. స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు స్వర్ణలత మాట్లాడుతూ.. ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలలో బడీడు ఉన్న పిల్లలను బడిలో చేర్పించుకోవాలని కోరారు. స్కూల్ యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజనం ఉచితంగా అందుతుందన్నారు.

తాంసి: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శుక్రవారం సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. సరస్వతి దేవి చిత్రపటానికి పూజలు చేశారు. ఎంఈవో శ్రీకాంత్, పాఠశాల హెచ్‌ఎం కవిత, ఉపాధ్యాయులు సంతోశ్, సరిత పాల్గొన్నారు.

నార్నూర్: మండలంలోని తాడిహత్నూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. ఎంఈవో పవార్ అనిత పాల్గొని చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. పిల్లలను చదివిస్తేనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. పీఆర్టీయూ మండల అధ్యక్షుడు జాదవ్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు బాపూరావు, సురేశ్, తదితరులు పాల్గొన్నారు.



అక్షరాభ్యాసం చేయిస్తున్న ఎంఈవో శ్రీకాంత్



అక్షరాభ్యాసం చేసిన విద్యార్థులతో అధికారులు

పాఠశాల అభివృద్ధికి కృషి

బోథ్: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తానని బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ భోడ్డు గంగారెడ్డి అన్నారు. శుక్రవారం సొనాల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన బడిబాట కార్యక్రమంలో పాల్గొని పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు నోటు పుస్తకాలు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. నాయకులు లోలపు పోశెట్టి, గాజుల పోతన్న, చెట్లపల్లి అనిల్, జంగాల భోజన్న, కసిర పోతన్న, అమత రావు పటేల్ పాల్గొన్నారు

- బోథ్ మండలంలోని ధన్నూర్(బి) గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు రావుల శంకర్ మాట్లాడుతూ.. 26 మంది విద్యార్థులకు వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య అక్షరాభ్యాసం చేయించినట్లు తెలిపారు. ఎంఈవో మహ్మద్ హుస్సేన్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు రాజు చోప్డే, ఉపాధ్యాయులు రాథోడ్ సవిత, స్వప్న, మాడ ప్రశాంత్ కుమార్, బోనగిరి సారిక పాల్గొన్నారు

యోగాతో మానసిక ఒత్తిడి దూరం

బోథ్: అంతర్జాతీయ యోగా దినోత్సవ దశాబ్ది వేడుకలలో భాగంగా 16వ రోజు సొనాల మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం ఆయుష్ యోగా ఇన్‌స్ట్రక్టర్ మునిగెల యోగిత ఆసుపత్రి సిబ్బందికి, గ్రామస్తులకు యోగా ప్రాముఖ్యత వివరించారు. ఈ సందర్భంగా పలు యోగాసనాలను నేర్పించారు. యోగాతో మానసిక ఒత్తిడి దూరం అవుతుందన్నారు. పీహెచ్‌సీ వైద్యాధికారి నవీన్ రెడ్డి, ఆసుపత్రి సూపర్‌వైజర్ కవిత, సంధ్య, ఫార్మసీ ఆఫీసర్ మనోహర్, నర్సింగ్ ఆఫీసర్ చంద్రబాగ, జమున, లక్ష్మణ్ పాల్గొన్నారు.



యోగా చేస్తున్న వైద్యులు, సిబ్బంది